

డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం డీన్, ప్రొఫెసర్ వెంకటసుందరానంద పుచ్చా విడుదల చేశారు. శనివారం పరీక్షల విభాగం చాంబర్లో జూలై, ఆగస్టు 2023 పరీక్షల ఫలితాలను వెబ్ సైట్‌లో పొందుపరిచారు. 2వ సెమిస్టర్లో 1,132 మందికి 262 మంది, 4వ సెమిస్టర్లో 2,717 మందికి 620 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు.

గెలుపు గుర్రాలు రెడీ









- టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల
- మూడు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు వెల్లడి
- ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు పెండింగ్
- ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్
- రెండో జాబితా విడుదలకు కసరత్తు



కల్లూరులో టీడీపీ జెండాలతో నాయకులు

అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశాయి. పాణ్యం అభ్యర్థిగా గౌరు చరితను ప్రకటించడంతో కర్నూలు నగరంలోని అమ్మా హాస్పిటల్ సర్కిల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. అలాగే కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిగా టీజీ భరత్‌ను ప్రకటించడంతో శనివారం మౌర్యఇన్ వద్ద ఆయన అనుచరులు, అభిమానులు కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం టీడీపీ, జనసేన పార్టీ నేతలు టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరికి సీటు ఖరారు కావడంతో విష్ణు నివాసం వద్ద ఆయన వర్గీయులు భారీ ఎత్తున బాణా సంచా కాల్చారు. విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు బొగ్గుల దస్తగిరిని గజమాల వేసి ఘనంగా సత్కరించారు. నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నుంచి పసుపుల గ్రామం వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ డోన్ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పేరును అధిష్ఠానం ప్రకటించడంతో శనివారం కోట్ల, కేఈ వర్గాలు సంబరాలు జరుపుకున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై బాణా సంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశాయి. అనంతరం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో కార్యకర్తలు పూజలు చేశారు. నంద్యాల, బనగానపల్లె, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోనూ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

కర్నూలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గెలుపు గుర్రాలను అధినేత చంద్రబాబు నాయుడు శనివారం ప్రకటించారు. టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఒకే వేదికపై నుంచి అభ్యర్థులను వెల్లడించారు. గెలిచే అభ్యర్థులనే బరిలో దింపాలనే లక్ష్యంగా ఇరు పార్టీ అధినేతలు సుదీర్ఘంగా కసరత్తు చేశారు. ఇందులో భాగంగా కోటి మందికి పైగా అభిప్రాయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన ఉమ్మడిగా 118 మంది అభ్యర్థులకు తొలి జాబితాలో స్థానం దక్కింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తొమ్మిది మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో టీడీపీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి టీజీ భరత్, పత్తికొండ నియోజకవర్గం అభ్యర్థి కేఈ శ్యామ్‌కుమార్ (శ్యాంబాబు), కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరి, పాణ్యం నియోజకవర్గానికి గౌరు చరితను అధినేత చంద్రబాబు ఎంపిక చేశారు. సామాజిక, రాజకీయ సమీకరణలు, గెలిచే అవకాశాలు, కుటుంబ నేపథ్యం.. వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. టీజీ భరత్, కేఈ శ్యాంబాబు ఇద్దరు కూడా గత ఎన్నికల్లో కూడా టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారే. ఐదేళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జిలుగా పార్టీ పటిష్ఠత కోసం అధిష్ఠానం నిర్దేశించిన వివిధ కార్యక్రమాలు ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్లారు. ముందే ఊహించినట్లుగానే వీరికి తొలి జాబితాలోనే స్థానం దక్కింది. అయితే.. కోడుమూరు (ఎస్సీ) నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపిక చేసిన బొగ్గుల దస్తగిరి రాజకీయాలకు కొత్తనే చెప్పాలి. కొంత కాలంగా నియోజకవర్గంలో చురుగ్గా రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా తిరుగుతున్నారు. తొలి జాబితాలోనే అవకాశం దక్కించుకోవడం కొసమెరుపు.

ముగ్గురూ ఉన్నత విద్యావంతులే

టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన ముగ్గురు అభ్యర్థులు కూడా ఉన్నత విద్యావంతులు.. యువకులే. టీజీ భరత్ యూకేలో ఎంఏ పూర్తి చేశాడు. యువ పారిశ్రామికవేత్తగా రాణిస్తున్నారు. కేఈ శ్యాంబాబు ఎంబీఏ పూర్తి చేసి కొంత కాలం స్టార్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలో ఉద్యోగం చేశారు. ఆ తరువాత సొంతంగా కంపెనీలు స్థాపించి వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. గౌరు చరిత పొలిటికల్ సైన్సులో డిగ్రీ చేశారు. వ్యాపార, రాజకీయాల్లో రాణించారు. బొగ్గుల దస్తగిరి ఎంకాం, ఎంబీఏ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. న్యాయవాది వృత్తిలో రాణిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత కొన్నాళ్లు ఓ ప్రముఖ పత్రికలో పాత్రికేయుడిగా కూడా పని చేశాడు.



పత్తికొండలో బాణసంచా పేలుస్తున్న నాయకులు



విష్ణువర్ధన్‌రెడ్డి, దస్తగిరిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



గూడూరులో నాయకుల హర్షాతిరేకాలు



కర్నూలు టీడీపీ అభ్యర్థిగా టీజీ భరత్‌ను ఎంపిక చేయడంపై మౌర్య ఇన్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



కోట్లకు పూలబొకే ఇస్తున్న కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి

ఐదేళ్ల జగన్ పాలన అబద్ధాలమయం

పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

మద్దికెర, ఫిబ్రవరి 24: వైసీపీ ఐదేళ్ల పాలన అబద్ధాలతో సాగిందని, ప్రజలు ఎవరూ కూడా ఆయన్ను నమ్మే స్థితిలో లేరని పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మద్దికెర గ్రామంలోని గ్రామ దేవత మద్దమ్మవ్వను దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు కేఈ శ్యాంబాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ అభ్యర్థిగా కేఈ శ్యాంబాబు పేరు ఖరారు కావడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలు, అన్యాయాలు పెరిగాయన్నారు. జగన్ అరాచకాలపై వాస్తవాలను తెలియజేస్తున్న పత్రికా కార్యాలయాలు, మీడియా ప్రతినిధులపై దాడి చేయించి చరిత్రహీనుడిగా జగన్ రెడ్డి నిలిచిపోయాడన్నారు. పత్తికొండ తాలుకా తెలుగుదేశం పార్టీకి కంచుకోట లాంటిదని, కార్యకర్తలంతా కష్టపడి పని చేసి విజయానికి పునాది వేయాలన్నారు. మద్దికెర మండలంలో కూడా తెలుగుదేశం పార్టీ మెజారిటీ రావడం తథ్యమన్నారు. పత్తికొండ టీడీపీ టికెట్ ఇవ్వడం పట్ల చంద్రబాబుకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, పురుషోత్తం చౌదరి, జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న, రాతన మనోహర్ చౌదరి, ఎన్.లక్ష్మినారాయణ, పెరవలి రామాంజులు, హరి, రంగయ్య, సుధాకర్ చౌదరి, రామాంజులు, ఉదయ్ కుమార్, రాము, ఆనంద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల పరిశీలన

26న మెడికల్ కాలేజీలో జరిగే భూమి పూజ రద్దు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 24: కర్నూలు మెడికల్ కాలేజీ మైదానంలోని వివాదాస్పద స్థలాన్ని శనివారం ఉదయం త్రీ టౌన్ పోలీసులు పరిశీలించారు. పత్రికల్లో వచ్చిన కథనంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి భూమి పూజ జరిగిన స్థలాన్ని పరిశీలించారు. మల్టీ యుటిలిటీ సెంటర్ వివాదంపై పోలీసులు ఆరా తీశారు. అనంతరం పోలీసు అధికారులతో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడారు. వైద్యులకు చెప్పకుండా భూమి పూజ చేశారని, దీంతో కొందరు సెంటిమెంట్‌గా ఫీలయ్యారని ప్రిన్సిపాల్ పోలీసులకు వివరించినట్లు తెలిసింది. ఈ నెల 26న కర్నూలు మెడికల్ కాలేజీ గ్రౌండులో ఏర్పాటు చేయనున్న మల్టీ యుటిలిటీ సెంటర్ భూమి పూజను డీఎంఈ ఆదేశాల మేరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ప్రిన్సిపాల్ పి. సుధాకర్ తెలిపారు. త్వరలో స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి మల్టీ యుటిలిటీపై వైద్యుల అభిప్రాయాన్ని సేకరించనున్నట్లు తెలిపారు.

రెండో జాబితా ఎప్పుడో..?

ఆ నాలుగు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై టెన్షన్



కర్నూలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మొదటి జాబితాలో పేర్లు కనిపించని టీడీపీ అభ్యర్థులు రెండో విడుత జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. శనివారం టీడీపీ-జనసేన ప్రకటించిన ఉమ్మడి అభ్యర్థుల జాబితాలో కర్నూలు, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాలే ఉన్నాయి. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల అభ్యర్థుల ను ప్రకటించకపోవడంతో ఆశావహుల్లో నిరుత్సాహం నెలకొంది. టికెట్ తమకే ఖాయమని భావిస్తున్న సీనియర్ టీడీపీ నాయకుల్లో టెన్షన్ నెలకొంది. ఎందుకు తమ పేరు లేదోనని రాష్ట్ర స్థాయి నాయకులకు ఫోన్లు చేసి ఆరా తీస్తున్నారు. అయితే.. ఈ నాలుగు నియోజకవర్గాల్లో ఇద్దరు, ముగ్గురు టికెట్ ఆశిస్తుండడం.. సామాజిక సమీకరణలు, పార్టీల పొత్తుల నేపథ్యంలో గెలుపు గుర్రాలు ఎంపికపై తుది కసరత్తు జరగలేదని తెలుస్తోంది.

కారణాలు ఇవేనా..?

కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు 2019 ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. కర్నూలు ఎంపీగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా కోట్ల సుజాతమ్మలు పోటీ చేసి ఓడిపోయారు. ఆలూరు ఇన్‌చార్జిగా సుజాతమ్మ ఐదేళ్లుగా పార్టీ కార్యక్రమాలు చురుగ్గా నిర్వర్తిస్తూ వచ్చారు. అయితే.. కుటుంబానికి ఒకే టికెట్ అనే విధానం టీడీపీ తీసుకొచ్చింది. కర్నూలు ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయిస్తామని రెండేళ్లుగా టీడీపీ నాయకులు చెబుతూ రావడంతో ఆలూరు టికెట్ సుజాతమ్మకు ఖాయమని భావించారు. అయినప్పటికీ ఆలూరు నుంచి టికెట్ కోసం పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అయితే.. డోన్ నియోజకవర్గం నుంచి వైసీపీకి చెందిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపైన ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి ధర్మావరం సుబ్బారెడ్డి గెలవలేరని డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిని చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఆలూరును పెండింగ్‌లో పెట్టారు. రెండో జాబితాలో వీరభద్రగౌడ్, వైకుంఠం కుటుంబంలో ఒకరికి చాన్స్ వస్తుందా..? మరో కొత్త వ్యక్తి తెరపైకి వస్తాడా..? అన్న చర్చ జరుగుతోంది.

- ఆదోని టీడీపీ టికెట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు సహా ఆ పార్టీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, మదిరె భాస్కరరెడ్డిలతోపాటు ఇటీవలే టీడీపీలో చేరిన బస్సాపురం శ్రీకాంత్‌రెడ్డి ఆశిస్తున్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఆదోని టికెట్ జనసేన ఆశిస్తోందన్న ప్రచారం కూడా ఉంది. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని జనసేన నియోజకరవ్గం ఇన్‌చార్జి మల్లప్ప తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేగాకుండా బీజేపీతో పొత్తు అనివార్యమైతే ఆ పార్టీ కూడా ఆదోని టికెట్ ఆశించనున్నట్లు సమాచారం. టీడీపీ అంతర్గత సర్వేలు మీనాక్షినాయుడుకే అనుకూలంగా ఉన్నప్పటికీ.. సామాజిక సమీకరణాలు, పొత్తుల కారణంగానే ఆదోని అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది.
- ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఖరారైందని, ప్రచారం చేసుకోమని ఆ పార్టీ అధిష్ఠానం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. తొలి జాబితాలో బీవీ పేరు ఉంటుందని ఆయనతోపాటు సన్నిహితులు భావించారు. అయితే.. కొన్నాళ్లుగా ఎమ్మిగనూరు టికెట్ తనకు వస్తుందనే విశ్వాసంతో ఎంజీ కుటుంబానికి చెందిన డాక్టర్ మాచాని సోమనాథ్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నాడు. ఈయన వైసీపీ అభ్యర్థిగా ఎంపికైన బుట్టా రేణుకకు స్వయాన అల్లుడు. వైసీపీ బీసీలకు టికెట్ ఇచ్చిందని, టీడీపీ కూడా బీసీలకే ఇస్తుందనే ఆశాభావంతో సోమనాథ్ ముందుకు వెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెండో జాబితాలో అవకాశం ఎవరికి ఉంటుందోనని కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.
- మంత్రాలయం నియోజకవర్గం నుంచి టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి రెండు పర్యాయాలు ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఐదేళ్లుగా టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ అధిష్ఠానం నిర్దేశించిన కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించారు. తమకు ఒక అవకాశం ఇవ్వాలని వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఉలిగయ్య ఆశిస్తున్నారు. అదే వాల్మీకి వర్గానికి చెందిన వైసీపీ నాయకుడు మాధవరం రాఘవేంద్రరెడ్డి ఇటీవలే టీడీపీలో చేరారు. తనకే టికెట్ వస్తుందని బాహాటంగానే ప్రచారం చేస్తున్నారు. టీడీపీ అధిష్ఠానం టికెట్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి పార్టీలోకి చేర్చుకుందని అంటున్నారు.
- అధికార పార్టీ దౌర్జన్యాలు, అక్రమ కేసులు ధైర్యంగా ఎదుర్కొని ఐదేళ్లు పార్టీని బలోపేతం చేయడమే కాకుండా చంద్రబాబు చేపట్టిన బాదుడే బాదుడు, లోకేశ్ పాదయాత్ర, నారా భువనేశ్వరి నిజం గెలవాలి.. వంటి కార్యక్రమాలు సహా వివిధ కార్యక్రమాలు దిగ్విజయం చేయడం, పార్టీ బలోపేతం కోసం రూ.కోట్లు ఖర్చు చేశారని, తొలి జాబితాలో పేరు లేకపోగా కొత్త వాళ్లకు ఇస్తారనే ప్రచారంతో మీనాక్షినాయుడు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, తిక్కారెడ్డి వర్గీయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారు.

కన్నుల పండువగా మద్దమ్మ జాతర



మద్దికెర, ఫిబ్రవరి 24: మద్దికెర ప్రజల ఇలవేల్పు మద్దమ్మవ్వ జాతర శనివారం కన్నుల పండువగా సాగింది. మద్దమ్మవ్వ రథోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ముందుగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించగా.. చిన్న నగిరి, పెద్ద నగిరి యాదవరాజులు అమ్మవారికి రూ.2 లక్షలు విలువ చేసే ముక్కుపుడకను అలంకరించారు. అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన జంబునాథ్‌రాయుడు, సంధ్యారాణి, శ్రీనివాసులు, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు యాదవ రాజులు చిన్న నగిరి, పెద్ద నగిరి సమక్షంలో రథోత్సవం వైభవంగా సాగింది. అశేష జనవాహిని నడుమ అమ్మవారి రథం ముందుకు కదిలింది. ప్రజలు రథంపై అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. అనంతరం రాత్రి దేవాలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎట్టకేలకు టీడీపీ అధిష్టానం నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో ఐదు స్థానాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. దీంతో ఇప్పటి వరకు సాగిన ఉత్కంఠకు తెరపడింది. అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశాయి. అయితే పెండింగ్‌లో ఉన్న స్థానాలపై టెన్షన్ నెలకొంది. ఒక్కో స్థానం నుంచి ఇద్దరు ముగ్గురు పేర్లు వినిపిస్తుండడంతో ఎవరికి సీటు ఖరారు చేస్తారన్న దానిపై చర్చ నడుస్తోంది. అనేక సమీకరణలను పరిగణలోకి తీసుకొని త్వరలో రెండో జాబితా ప్రకటించే అవకాశం కనిపిస్తోంది.

-కర్నూలు/నంద్యాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి)



డోన్: కోట్ల నియోజకవర్గం



పేరు: కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి
తల్లిదండ్రులు: కోట్ల శ్యామలాదేవి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి (దివంగత మాజీ ముఖ్యమంత్రి)
పుట్టిన తేదీ: సెప్టెంబరు 18, 1951
విద్యాభ్యాసం: బీఏ, ఇంగ్లీష్ లిటరేచర్
కుటుంబం: కోట్ల సుజాతమ్మ (భార్య, మాజీ ఎమ్మెల్యే)
కూతుళ్లు: నివేదిత, చిత్ర
కుమారుడు: కోట్ల రాఘవేంద్రరెడ్డి
పదవులు: 1991, 2004, 2009లలో కర్నూలు ఎంపీగా పని చేశారు. 2012లో కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిగా పని చేశారు.
ఇష్టమైన ఆట: టెన్నిస్

రాజకీయ నేపథ్యం: కోట్ల కుటుంబం రెండు సార్లు సీఎం పదవులను అలంకరించింది. దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికయ్యారు. 1982 నుంచి 1983 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి పని చేశారు. ఆ తర్వాత 1992 అక్టోబరు నుంచి 1994 వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా పని చేశారు. పలుమార్లు కేంద్ర మంత్రిగా కూడా ఆయన పని చేశారు. ఆయన తనయుడు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కర్నూలు ఎంపీగా మూడుసార్లు ఎన్నికయ్యారు. మొదటిసారిగా 1992లో కర్నూలు పార్లమెంటుకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2004లో, 2009లో కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 2012 సంవత్సరంలో కేంద్ర రైల్వే సహాయ శాఖ మంత్రిగా కోట్ల పని చేశారు. 2019 ఎన్నికలో కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.

కర్నూలు నియోజకవర్గం



పేరు: టీజీ భరత్
విద్యార్హత: ఎంఏ (యూకే)
కుటుంబ నేపథ్యం: అమ్మానాన్నలు టీజీ భరత్ (మాజీ ఎంపీ), రాజ్యలక్ష్మి, భార్య టీజీ శిల్పా, సంతానం కుమారుడు టీజీ విభ, కూతురు శ్రీఆర్య

రాజకీయ నేపథ్యం: కర్నూలులో టీజీ కుటుంబం పారిశ్రామిక రంగంలోనే కాదు.. రాజకీయ రంగంలోనూ రాణిస్తున్నారు. టీజీ గ్రూప్ ఆఫ్ కంపెనీల అధినేత టీజీ వెంకటేశ్ 1999లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ ఎంపీగా పని చేశారు. ఆయన వారసుడిగా టీజీ భరత్ రాజకీయ అరంగేట్రం చేసి గత ఎన్నికల్లో తొలిసారిగా టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

పత్తికొండ నియోజకవర్గం



పేరు: కేఈ శ్యాంబాబు
విద్యార్హత: ఎంబీఏ
కుటుంబ నేపథ్యం: అమ్మానాన్నలు కేఈ కృష్ణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం, పద్మమ్మ, భార్య సునీత, సంతానం సుదీక్ష, జయని, జయతి

రాజకీయ నేపథ్యం: కేఈ కుటుంబం ఉమ్మడి జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం. శ్యాంబాబు జేజినాయన దివంగత కేఈ మాదన్న 1963లోనే జిల్లా సమితి అధ్యక్షుడిగా పని చేశారు. 1967తో కర్నూలు ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. తండ్రి మాదన్న రాజకీయ వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన కేఈ కృష్ణమూర్తి 1978లో తొలిసారిగా డోన్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నాటి నుంచి ఆరు 2014 ఎన్నికల వరకు డోన్, పత్తికొండ నుంచి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా గెలిచారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గంలో కేబినెట్ మంత్రి, డిప్యూటీ సీఎంగా పని చేశారు. తండ్రి వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన కేఈ శ్యాంబాబు 2019లో తొలిసారిగా పత్తికొండ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.

నంద్యాల నియోజకవర్గం



పేరు: నశ్యం మహమ్మద్ ఫరూక్
జననం: 1950 జనవరి 15, నంద్యాల
పిల్లలు: ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె
విద్యార్హత: పీయూసీ
పదవులు: రాష్ట్ర విభజన అనంతరం ఏపీ శాసన మండలి చైర్మన్, ఉమ్మడి ఏపీ డిప్యూటీ స్పీకర్, మాజీ మంత్రి, మూడు సార్లు ఎమ్మెల్యే

నేపథ్యం: టీడీపీ ఆవిర్భావంతో ఎన్టీఆర్‌తో కలిసి నడిచారు. పార్టీ పుట్టిన దగ్గర నుంచి ఇప్పటి వరకు పార్టీ మరకుండా, టీడీపీ వీర విధేయుడిగా ఉన్నారు. ఎన్టీఆర్ రెండో దఫా 1984 ప్రభుత్వంలో చక్కెర, వక్ఫ్‌బోర్డు శాఖ మంత్రిగా పని చేశారు. అనంతరం 1989లో ఓడిపోయారు. మళ్లీ 1994, 99లో రెండు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ సమయంలోనే ఉమ్మడి ఏపీకి డిప్యూటీ స్పీకర్, ఉన్నత విద్య, పురపాలక శాఖ మంత్రిగా పని చేశారు. 2019లో నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచిన భూమా నాగిరెడ్డి 2017 అకాల మరణంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఫరూక్ పని తనాన్ని గుర్తించిన చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టడమే కాకుండా, ఆరోగ్య విద్య మంత్రిని కూడా చేశారు. ఇక ఇదే ప్రభుత్వ సమయంలో 2018 నుంచి సంవత్సరం పాటు ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్‌గా పని చేశారు.

శ్రీశైలం నియోజకవర్గం



పేరు: బుడ్డా రాజశేఖరరెడ్డి
కుటుంబం: బుడ్డా వెంగళరెడ్డి, (మాజీ మంత్రి), ఓబులమ్మ తల్లిదండ్రులు. కూతురు మేఘన
ఎన్నిసార్లు పోటీ: మూడు సార్లు (2009, 2014, 2019)
పదవులు: 2014లో ఎమ్మెల్యేగా గెలుపు
ఎడ్యుకేషన్: బీఏ, ఎల్ఎల్‌బీ

టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తొలి జాబితాలో తన పేరును ప్రకటించడంపై బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం సీటును తనకు కేటాయించిన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించిన బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో శ్రీశైల నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

కోడుమూరు నియోజకవర్గం



పేరు: బొగ్గుల దస్తగిరి
విద్యార్హత: ఎంకామ్, ఎంబీఏ, ఎల్ఎల్ఎం
కుటుంబ నేపథ్యం: అమ్మా నాన్నలు రాముడు (లేట్), బొగ్గుల శీలమ్మ సర్పంచ్, భార్య సుధారాణి, సంతానం గౌతమ్ శివరామ్, కార్తీక్ శివరామ్

● రాజకీయ నేపథ్యం : కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన రైతు కుటుంబానికి చెందిన ఈయన జేజినాన్న బొగ్గుల వనుమన్న, తండ్రి రాముడు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తల్లి శీలమ్మ సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు.

పాణ్యం నియోజకవర్గం



పేరు: గౌరు చరిత
విద్యార్హత డిగ్రీ: (పొలిటికల్ సైన్సు)
కుటుంబ నేపథ్యం: భర్త గౌరు వెంకటరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, కొడుకు గౌరు జనార్దన్‌రెడ్డి, కూతురు చిద్విలా రెడ్డి

రాజకీయ నేపథ్యం : రాజకీయ, వ్యాపారం కుటుంబం నుంచి వచ్చారు. గౌరు చరిత మామ గౌరు జనార్దన్‌రెడ్డి, తాత గౌరు ఈశ్వరరెడ్డి నందికొట్కూరు నియోజకవర్గంలో రాజకీయంగా కీలకంగా పని చేశారు. 2004లో నందికొట్కూరు నుంచి, 2014లో పాణ్యం నుంచి రెండు పర్యాయాలు చరితమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు. గత ఎన్నికల ముందు టీడీపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేసి ఓడిపోయారు. ఈమె భర్త గౌరు వెంకటరెడ్డి సీనియర్ రాజకీయ నాయకుడు. రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పోటీ చేశారు.

బనగానపల్లె నియోజకవర్గం



పేరు: బీసీ జనార్దన్‌రెడ్డి
పదవులు : మాజీ ఎమ్మెల్యే (2014), నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి.
జననం : 1959 జూలై 5
పుట్టిన స్థలం: యనకండ్ల గ్రామం, బనగానపల్లె మండలం
తల్లిదండ్రుల పేర్లు: బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మీదేవి
భార్య: బీసీ ఇందిరమ్మ
పిల్లలు: బీసీ మనోహర్ రెడ్డి, మనోరమ, శ్రీలక్ష్మి
విద్యార్హత: బీఏ

కాంట్రాక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించే బీసీ జనార్దన్‌రెడ్డి మొదట రియల్ ఎస్టేట్, కాంట్రాక్టరు. ఇవి చేస్తూనే ప్రజాసేవ మీద మక్కువతో ఆయన సోదరుడు బీసీ రాజారెడ్డితో కలసి తండ్రి గుర్రెడ్డి పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. రాజకీయాల్లో చేరితే ప్రజలకు మరింత చేరువ అవ్వచ్చన్న ఉద్దేశంతో 2011లో టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇవ్వడంతో ఇక్కడ నుంచి పోటీచేశారు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డిపైన 17,341 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. పోటీ చేసిన మొదటిసారే బలమైన ప్రత్యర్థిని ఓడించడంతో జనార్దన్‌రెడ్డి పేరు జిల్లాలో మారుమోగింది. అయితే ఆ తర్వాతి ఎన్నికల్లో ఫ్యాన్ గాలి బలంగా వీచడంతో అదే వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఓడిపోయినా టీడీపీలోనే కొనసాగుతూ ప్రజలతో మమేకమవుతూ జిల్లాలో బలమైన నేతగా ఎదిగారు. జిల్లాలో టీడీపీ గెలిచే మొదటి సీటు బనగానపల్లె అనేంతస్థాయిలో చరిష్మాను సంపాదించారు. ప్రస్తుతం టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో చోట దక్కించుకున్న బీసీ జనార్దన్‌రెడ్డి విజయం ఖాయమైపోయిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

ఆళ్లగడ్డ నియోజకవర్గం



పేరు: భూమా అఖిలప్రియ
జననం: 2-4-1987
స్థలం : ఆళ్లగడ్డ
విద్యార్హతలు : బీబీఎం (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంటు, లండన్)
పదవులు: మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి
భర్త: భార్గవ్‌రామ్‌నాయుడు

నేపథ్యం: భూమా అఖిలప్రియది రాజకీయం కుటుంబం. ఆమె తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి ఇద్దరు కూడా ఎమ్మెల్యేలుగా పని చేశారు. నాగిరెడ్డి ఆళ్లగడ్డ, నంద్యాల ఎమ్మెల్యేగా పని చేయగా, శోభా నాగిరెడ్డి ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా పని చేశారు. 2014 ఎన్నికల్లో ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా శోభా నాగిరెడ్డి పోటీ చేశారు. అయితే దురదృష్టవశాత్తు ఈ ఎన్నికల ప్రచారానికి వెళ్లి వస్తున్న శోభా నాగిరెడ్డి ఆళ్లగడ్డ మండలం గూబగుండం మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె చని పోయిన తరువాత కూడా జరిగిన పోలింగులో ప్రజలు ఆమెకు ఓట్లు వేసి గెలిపించారు. ఆ తరువాత ఆళ్లగడ్డ నుంచి ఆమె కుమార్తె భూమా అఖిలప్రియ వైసీపీ తరఫున బరిలోనికి దిగారు. అయితే అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు శోభా నాగిరెడ్డి మీద గౌరవంతో అఖిలప్రియకు పోటీగా తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. దీంతో అఖిలప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక 2014 ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున గెలిచిన నాగిరెడ్డి తదనంతర పరిణామాలతో టీడీపీ చేరారు. అయితే 2017లో నాగిరెడ్డి కూడా ఆకస్మికంగా మరణించారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం అఖిలప్రియకు పర్యాటక శాఖ మంత్రి పదవిని కట్టబెట్టారు.

అత్త ఇంట్లో అల్లుడి దొంగతనం

● కేసును ఛేదించిన మూడో పట్టణ పోలీసులు
● రూ.4.80 లక్షల బంగారు నగలు స్వాధీనం

ఆదోని, ఫిబ్రవరి 24: అత్త బంగారు నగలు ఇవ్వలేదన్న కోపంతో అల్లుడు దొంగతనం చేశాడు. ఈ సంఘటన ఆదోనిలో జరిగింది. శనివారం పోలీసులు నిందితుడ్ని పట్టుకున్నారు. ఈనెల 22న రాఘవేంద్ర కాలనీలోని షాహిన్ అనే మహిళ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో 8 తులాల బంగారు నగలు, వెండి పట్టీలు గుర్తు తెలియని వ్యక్తి దొంగతనం చేశాడు. దీని గురించి బాధితురాలు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ.. శనివారం రిలయన్స్ ట్రెండ్స్ సమీపంలో ఉస్మానాబాద్‌కు చెందిన సయ్యద్ ఇసాక్ తమను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. నిందితుడిని విచారించగా షాహిన్ చిన్న కూతురు షాహినా భర్తనని తెలిపాడు. అత్త తనకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అత్త షాహిన్ ఇంటికి వెళ్లి తాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న బంగారు, వెండి, డబ్బు దొంగతనం చేశానని ఒప్పుకున్నాడని అన్నారు. నిందితుడి నుండి 34.729 గ్రాముల లాంగ్ చైన్, 29.564 గ్రాముల షార్ట్ చైన్, 20.728 గ్రాముల బంగారు నెక్లెస్, 10 గ్రాముల బంగారు ఉంగరాలు, 20.480 గ్రాముల మూడు జతల బంగారు, 204 గ్రాముల వెండి పట్టీలు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.4.80 లక్షలు ఉండవచ్చని వివరించారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ఐదు దుకాణాల్లో చోరీ

పత్తికొండ, ఫిబ్రవరి 24 : పత్తికొండ పట్టణంలో నిత్యం రద్దీగా ఉంటే స్టేట్‌బ్యాంక్ సర్కిల్, కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రాంతాలలో శుక్రవారం రాత్రి 5 దుకాణాలలో చోరీ జరిగింది. కన్యకాపరమేశ్వరి దేవాలయం ముందు రీడింగ్ రూం కాంప్లెక్స్‌లో ఉన్న ఐడీఎఫ్‌సీ సర్వీస్ పాయింట్ తాళాలు పగలగొట్టిన దొంగలు క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ 60 వేలు చోరీచేశారు. అలాగే పాత వెంకటేశ్వర టాకీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న భగవాన్ మొబైల్స్‌లో కస్టమర్లు రిపేరీ కోసం ఇచ్చిన నాలుగు సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లారు. స్టేట్‌బ్యాంక్ ముందున్న బీడీ బంక్‌లో రూ1,500 నగదుతోపాటు రూ 5వేల విలువగల సిగరెట్ ప్యాకెట్‌లను తీసుకెళ్లారు. శ్రీరామ్ సెలూన్‌లో టీటీ కట్టేందుకు దాచిపెట్టుకున్న రూ 10,000 నగదుతోపాటు పక్కనే ఉన్న చాముండేశ్వరి కిరాణ జనరల్‌స్టోర్ కౌంటర్‌ఉన్న రూ 4వేల నగదును ఎత్తుకెళ్లారు. ఒకేరోజు 5 దుకాణాలలో దొంగతనం జరగడంతో దుకాణదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎస్ఐ గోపాల్ చోరీజరిగిన దుకాణాలను పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరు గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్ఐ గోపాల్ తెలిపారు.

అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: అక్రమంగా క్వారీలో రోడ్డు మెటల్‌ను తవ్వినా, క్రషర్ చేసినా కఠిన చర్యలు తప్పని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం సి. బెళగల్ మండలంలోని పలుకుదొడ్డి, గుండ్రేవుల గ్రామాల్లో సర్వే నెంబర్లు 457, 240 గ్రామాల్లో అక్రమంగా రోడ్డు మెటల్ క్యారింగ్, అక్రమ క్రషర్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేశామని తెలిపారు. క్రషర్ యూనిట్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించామని, సంబంధిత వ్యక్తులు ఏ. రాంభూపాల్, ఏ. ప్రభాకర్‌లపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మురహరి, దిలీప్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి మోసం చేసిన బీజేపీ

చాగలమర్రి, ఫిబ్రవరి 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి మోసం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. శనివారం చాగలమర్రి పీఎస్ డాబా వద్ద జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా చేసిందని అన్నారు. కడప జిల్లాలోని స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖపట్నం ఉక్కును ప్రైవేటుపరం చేయాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో ఉనికి లేని బీజేపీ కోసం టీడీపీ, వైసీపీ, జనసేనలు పాకులాడటం సిగ్గుచేటని అన్నారు. ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా మారాయని ధ్వజమెత్తారు. అటువంటి బానిస పార్టీలతో రాష్ట్రానికి ఏం మేలు జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు ముడి పడి ఉందని, ప్రత్యేక హోదా, అభివృద్ధికి ప్యాకేజీ నిధులు కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్, వామపక్షాల పొత్తు రాష్ట్రానికి అవసరం అన్నారు. ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు పోరాటం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాషా, అన్నమయ్య జిల్లా పుంగనూరు కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి, కడప జిల్లా నాయకులు అమర్, ఉత్తన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ మీడియా చైర్మన్ ఎన్.తులసీరెడ్డి

మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ హరినాథ్

శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్. హరినాథ్ కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద జస్టిస్ ఎన్. హరినాథ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఫిబ్రవరి 24: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ ప్రియదర్శిని, ఏపీ రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్ వెంకట రమణ శనివారం రాత్రి వేర్వేరు సమయాల్లో మంత్రాలయం వచ్చారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. వీరు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు స్వామివారి మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్ పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ చాంపియన్ పశ్చిమ గోదావరి

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 24: 52వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు స్వర్ణంతో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అలాగే కర్నూలు జట్టు రజిత పతకాలు, నంద్యాలకు కాంస్య పతకాలు దక్కాయి. శనివారం డా.కె. రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, టోర్నమెంటు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ కలిసి ట్రోఫీ, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు, నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మహబూబ్ బాషా, కోశాధికారి రాజ్‌కుమార్ రెడ్డి, ఆయా జిల్లా క్రీడా సంఘాల ప్రతినిధులు లక్ష్మణ్, జాన్ దత్తరావు, సురేష్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అరెస్టు

శ్రీశైలం, ఫిబ్రవరి 24: శ్రీశైలం దేవస్థానం పరిధిలో రాత్రి వేళలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆటో డ్రైవర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పగడాల శివ అనే యువకుడు ఘంటామఠం ప్రాంతంలో నివశిస్తూ దేవస్థానం పరిధిలోని ఇళ్లలో రాత్రి వేళలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. ఆన్‌లైన్ గేమ్స్ మద్యం, జూదం వంటి వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాడుపడ్డారన్నారు. ఇటీవల దేవస్థానం ఉద్యోగి ఇంట్లో జరిగిన దొంగతనం కేసు విచారణలో సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడ్ని గుర్తించినట్లు వెల్లడించారు. అతడి నుంచి మూడున్నర తులాల బంగారం, రూ. 1.35 లక్షలను రికవరీ చేసుకున్నామని, ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్ఐవో

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: మార్చి 1వ తేదీ నుంచి జరిగే ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో పరీక్షల కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, అడిషినల్ చీఫ్ సూపరింటెండెంట్లు, స్క్వాడ్ బృందాలకు, కస్టోడియన్లకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కరెంటు, నీటి వసతి, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ఫర్నీచర్స్ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. డీవీఈవో జమీర్ పాషా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలన్నారు. డీఈసీ మెంబర్లు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభుచరణ్, పద్మావతి, ప్రిన్సిపాల్ సుంకన్న, జూనియర్ కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీ మోహన్, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 24: ఈవీఎంల రాండమైజేషన్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని ఆర్వోలు, ఎఈఆర్వోలకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఈఆర్వోలకు ఈవీఎంల మొదటి విడత రాండమైజేషన్ (డ్రైరన్) పై జేసీ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈవీఎం రాండమైజేషన్ ఈఎంఎస్ వెబ్‌సైట్‌లో చేస్తామన్నారు. రెండో విడత ఈవీఎం రాండమైజేషన్ నియోజకవర్గ స్థాయిలో అబ్జర్వర్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేస్తామన్నారు. అందుకు గానూ ఆర్వోలు, ఏఈఆర్వోలకు కర్నూలు పార్లమెంటు జిల్లాలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, నంద్యాల పరిధిలోని పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గా నికి సంబంధించి ఈవీఎం రాండమైజేషన్‌పై అవగాహన కల్పించి ట్రైల్ రన్ నిర్వహిచామన్నారు. మున్సిపల్ కమి షనర్ భార్గవతేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్ శర్మ, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

'పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలి'

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఈనెల 26న అనంతపురంలో జరిగే సభను విజయవంతం చేయాలని డీసీసీ అధ్య క్షుడు కే.బాబురావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు అనంతపురం నగరంలోని న్యూ టౌన్ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభకు జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, గిడుగురుద్రరాజు మాణిక్యం ఠాగూరు, సీడీ మయ్యప్పన్, శైల జానాథ్ హాజరవుతారన్నారు.

కల్లూరు: ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు. శనివారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదర సంజీవయ్య కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహా మాట్లాడుతూ ఈనెల 26న అనంతపురంలో జరగబోయో రాష్ట్ర పునర్నిర్మాణసభను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నాగలింగం, సాంబశివుడు, హబీబ్‌పఠాన్ పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఈవో శ్యామూల్ అన్నారు. శనివారం బీ.క్యాంపు ఐఏఎస్ఈ కళాశాలలో నిర్వహించిన ఎంటర్ ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం జిల్లా స్థాయి ఎక్స్‌పో కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమానికి పది పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఈవో శ్యామూల్, ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయికి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వీటిలో ప్రథమ స్థానం స్మార్ట్ కంపోసర్ క్రష్, జడ్పీహెచ్ఎస్ చెరుకులపాడు, ద్వితీయ స్థానం మల్టీ ఫంక్షన్ ఫోన్ హోల్డర్ ఏపీజే స్కూల్ ఎంపిక అయ్యాయి. ఈ రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ తెలిపారు. ఎంపిక జ్యూరీ కమిటీ సభ్యులుగా డా.కేవీ మధుసూదన్, డి.మధు సుధాకర్ వ్యవహరించారు. విజేతలకు డీఈవో బహుమతులను అందజేశారు. ఈఎండీపీ మేనేజర్ గోపాలక్రిష్ణ, ఏడీ శ్యామూల్‌పాల్ పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో పకడ్బందీగా పని చేయాలి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల్లో పకడ్బందీగా పని చేయాలని స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో డిప్యూటి కమిషనర్ పి.నాగమద్దయ్య ఆదేశించారు. శనివారం జిల్లాలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాగలదిన్నె, మాధవరం చెక్ పోస్టుల్లో కొంత మంది అధికారులను నియమించాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల మద్యం, నాటు సారా, అనధికార అమ్మక కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహించాలని సూచించారు. ఇతర జిల్లాల సెబ్ అధికారులతో కలిసి అంతర్ జిల్లా దాడులు నిర్వహించాలని సూచించారు. పంచలింగాల చెక్ పోస్టులో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించాలన్నారు. సుంకేసుల చెక్‌పోస్టును తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఎస్ వినోద్ కేమార్, సీఐ రాజేంద్రప్రసాద్, పలు స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

సి.బెళగల్, ఫిబ్రవరి 24: మండలంలోని గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేష్ (42) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మాజీ ఎంపీపీ నాగమణి, మాజీ మండల కన్వీనర్ పాండురంగస్వామిగౌడ పార్థివదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అతని కుటుంబసభ్యులకు పాండురంగస్వామి గౌడ రూ.5000 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వెంకటేశ్వర గౌడ, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూడేకొండ, రమేష్ పాల్గొన్నారు.

టీడీపీ మాజీ మండల కన్వీనర్‌కు పరామర్శ: మండలంలోని పోలకల్లు గ్రామానికి చెందిన టీడీపీ మాజీ మండల కన్వీనర్ బీఎస్ తిమ్మప్పకు గుండెపోటు గురై కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను పార్టీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు. తిమ్మప్ప గుండె ఆపరేషన్‌ను విష్ణువర్ధన్‌రెడ్డి సొంత ఖర్చులతో చేయించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గోవిందు, రాముడు, అమర్, దాసు ఉన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ

కల్లూరు, ఫిబ్రవరి 24: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థులను ప్రకటించడంతో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. శనివారం గౌరు నివాసం నుంచి కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో అమ్మా హాస్పిటల్ సర్కిల్లో బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, డి.రామాంజనేయులు మాట్లాడుతూ పాణ్యం కోటపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరుమలేశ్వరరెడ్డి, పెద్దబీచుపల్లి, పల్లె రఘునాథ్‌రెడ్డి, పీయూ మాదన్న, శేఖ ర్‌చౌదరి, వంగాల జనార్దన్‌రెడ్డి, డివి.చంద్ర, లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, పవన్ కుమార్, వీరేంద్ర, జగదీష్‌రెడ్డి, చిన్నమారెన్న, ప్రభాకర్‌రెడ్డి, పీవీ రమణారెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: టీడీపీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలి జాబితాలో గౌరు చరితారెడ్డి పేరును పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో శనివారం ఓర్వకల్లులో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు, లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబు, వేణుగోపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఏసేపు, నారాయణ రెడ్డి, నాగరాజు, శ్రీరాములు, అయూబ్‌బాషా, యాసిన్‌బాషా పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాలో కర్నూలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ పేరును ప్రకటించడంపై కర్నూలు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మౌర్యఇన్ వద్ద ఆయన అనుచరులు, అభిమానులు కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం టీడీపీ, జనసేన పార్టీ నేతలు టీజీ భరత్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీజీ భరత్ పార్టీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగరవేస్తాం: విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(రూరల్): కోడుమూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరవేస్తామని టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబు కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరిని ప్రకటించడంతో విష్ణు నివాసం వద్ద ఆయన వర్గీయులు బాణా సంచా కాల్చారు. విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు బొగ్గుల దస్తగిరికి గజమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ కోడుమూరులో బొగ్గుల దస్తగిరిని అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇస్తానని అన్నారు. కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు బొగ్గుల దస్తగిరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి నగర శివారు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నుంచీ పసుపుల గ్రామం వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి, భారీ ఊరేగింపు చేశారు.

గూడూరు: కోడుమూరు టీడీపీ టికెట్ బొగ్గుల దస్తగిరికి రావడం పట్ల టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు ఆధ్వర్యంలో విష్ణు సేన అభిమానులు బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, బోజుగు దానమన్న, పౌలు, చాంద్ బాషా, విజయ్ కుమార్, విష్ణుసేన పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): అభ్యర్థుల జాబితాలో కోడుమూరు నుంచి బొగ్గుల దస్తగిరికి టికెట్ ఖరారు కావడంతో వర్కూరు గ్రామంలో టీడీపీ శ్రేణులు సంబరాలు జరిపారు. స్థానిక ఆటో స్టాండ్, న్యూఎస్సీ కాలనీల్లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశోక్, చెన్నరాయుడు, జే రాముడు, జీపు క్రిష్ణ, గడ్డమయ్య, రామాంజనేయులు, నాగరాజు, పుల్లన్న, ఇసాక్, క్రిష్ణ పాల్గొన్నారు.

సి.బెళగల్: టీడీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరిని శనివారం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంతో మండలంలోని టీడీపీ శేణు(శ్రే)లు బాణాలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. టీడీసీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి బొగ్గుల దస్తగిరి కలిసి పూల బొకే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు, ముని, ధనుంజయుడు, విష్ణు హమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, పోల కల్లు అమర్, దాసు, ఎంపీటీసీ, సర్పంచులు పాల్గొన్నారు.





ఓర్వకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కల్లూరులో..



టీజీ భరత్‌ను అభినందిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



బొగ్గుల దస్తగిరిని అభినందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి



కోడుమూరులో..

కోట్లను, బీటీ నాయుడులను కలిసిన బొగ్గుల దస్తగిరి

కర్నూలు(కల్చరల్): టీడీపీ కోడుమూరు అభ్యర్థిగా బొగ్గుల దస్తగిరికి ప్రకటిచడంతో శనివారం సాయంత్రం దస్తగిరి టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిని కర్నూలులోని ఆయన నివా సంలో పూల బొకే ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట్ల దస్తగిరిని అభినందించారు. అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు. అనంతరం దస్తగిరి టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయం చేరుకొని, అక్కడ అధ్యక్షుడు బీటీ నాయుడును కలిసి పూలబొకే అందించారు.

చౌడేశ్వరీదేవికి పట్టు వస్త్రాలు

» ముఖ్య అతిథిగా పాల్గొన్న కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

కోడుమూరు, ఫిబ్రవరి 24: చౌడేశ్వరీదేవి జాతరను పురస్కరించుకొని సర్పంచు భాగ్యరత్న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి శనివారం ఊరేగింపుగా పట్టు వస్త్రాలను తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఊరేగింపుగా అమ్మవారి దేవాలయానికి చేరుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీబీ లత, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆకెపోగు ప్రభాకర్, కేఈ మల్లికార్జునగౌడ్, కోట్ల కవితమ్మ, కిరణ్మయి, ఆంధ్రయ్య, ఎల్లప్ప నాయుడు, గోపాల్ నాయుడు, జూలకల్ సుధాకర్‌రెడ్డి, వేణగోపా ల్‌రెడ్డి, గిడ్డయ్యగౌడ్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు: చౌడేశ్వరిదేవి జాతర సందర్భంగా సోమవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక హైస్కూల్ మైదానంలో ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎండీ అస్లాం, ఐఏఎస్ అధికారి ఇం తియాజ్ మొదటి బహుమతిని రూ.20వేలు నగదును అందజేయనున్నారు. రెండో బహుమతిని 1976 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.10వేలు అందజేయనున్నారు. మూడో బహుమతిని సజ్జనగాండ్ల మల్లికా ర్జున రూ.5వేలు అందజేయనున్నారని బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం తైమూర్‌బాషా తెలిపారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కోట్ల

జగన్ ఇంటికే : సోమిశెట్టి



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికల్లో జగన్ ఓడిపోయి ఇంటికి వెళ్లడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంక టేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తానేదో గొప్పలు చేశానని ప్రగల్భాలు పలుకుతున్న జగన్మోహన్‌రెడ్డి సిద్ధమని చంద్రబాబుకు సవాలు విసరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను చేసిన అభివృద్ధి గురించి, ప్రజలకు జరిగిన అన్యాయం గురించి వివరించడానికి నేను సిద్ధంగా ఉన్నానని చంద్ర బాబు చర్చకు సిద్ధమా అని సవాలు విసిరగా తోకము డిచారన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసి ఉంటే లక్షల కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరేదని, జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి అమరావతిని విధ్వంసం చేయడానికి కుట్ర పన్నాడని, కేవలం తన ఆస్తులను పెంచుకోవడానికే ఈ నాటకాన్ని ఆడారని అన్నారు.

అటవీ శాఖ దోపిడీని అరికట్టాలి

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 24: హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ శివరాత్రికి శ్రీశైలానికి వెళ్లే మార్గంలో నాలుగు చెక్‌పోస్టుల వద్ద ఒక్కో వాహనానికి సుమారు రూ.200, సాక్షి గణపతి, హఠకేశ్వరం, శ్రీశైల క్షేత్రాల వద్ద పార్కింగ్ రూ.50, ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనం వద్ద రూ.1000, రుద్ర కోటేశ్వర క్షేత్రానికి వెళ్లేచోట రూ.300 వసూలు చేస్తున్నారని బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి.ప్రతాపరెడ్డి విమర్శించారు. శనివారం సాయంత్రం శ్రీశైల శివదీక్షా అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు కగ్గోలు హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ఎథిక్స్ సర్టిఫికెట్లు ప్రదానం

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 24: కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ హాలులో హౌస్ సర్జన్ పూర్తి చేసిన 250 మంది వైద్యులకు ఏపీ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఎథిక్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి మాట్లాడారు. అనంతరం వైద్యులకు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డిలతో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎథిక్ సర్టిఫికెట్లు అందజేశారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ ఈ నెల 27న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు పిలుపునిచ్చారు. ఇటీవల ప్రభుత్వం చర్చల పేరుతో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసి కేవలం వేలాది కోట్ల రూపాయల బకాయిల్లో రూ.250 కోట్లు జమ చేసి, 12వ పీఆర్సీ కమిషన్‌కు సంబంధించి 9 మంది స్టాఫ్ నియ మించి, ఏపీ జేఏసీ ఆందోళన విరమించుకోవలని కోరిందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఇస్మాయిల్, మరియానందం, రాష్ట్ర కౌన్సిలర్లు టీవీ కృష్ణయ్య, కె.తిమ్మప్ప పాల్గొన్నారు

కార్పొరేషన్‌లో ఇద్దరికి పదోన్నతులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 24: నగర పాలక సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. శనివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో కమిషనర్ భార్గవతేజ చేతుల మీదుగా పి.సాధిక్ హుస్సేన్, ఎం.రాజు పదోన్నతి పత్రాలు అందుకున్నారు.

27న రాఘవేంద్ర స్వామి బృందావనం పుష్కర వేడుకలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొగ్గరపు వాసుదేవయ్య తదితరులు

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 24: నగర శివారు శిల్పా టౌన్‌షిప్‌లో రాఘవేంద్రస్వామి బృందావనంలో పుష్కర వేడుకలను నిర్వహిస్తున్నట్లు నగరంలోని శ్రీరామభక్త ట్రస్టు అధ్యక్షుడు బొగ్గరపు వాసుదేవయ్య తెలిపారు. శనివారం వేడుకల పోస్టర్‌ను ఆయన భక్తులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వాసుదేవయ్య మాట్లాడుతూ గత పన్నెండేళ్లుగా భక్తులు నిత్యం స్వామిని దర్శించుకుంటున్నారని అన్నారు.

జర్నలిస్టుల కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: జగన్నాథగట్టు జర్నలిస్టుల కాలనీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం జర్నలిస్టుల కాలనీని ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు కోటి యా దవ్, అధికార ప్రతినిధి రామాంజనేయులు, ట్రెజరర్ లోకేశ్వరయ్య, భగత్, జర్నలిస్టులు మీసాల రామస్వామి, చెన్నయ్య, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 24: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కేవీ ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం ఊర్దూ యూని వర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మా ట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన షేక్ సనా నస్రీన్. షేక్ సల్వ పాతిమా పోస్టర్ ప్రదర్శనలో మూడో స్థానాన్ని సాధించారన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జహనారా, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 24: మండలంలోని గుడుంబాయి తండాలో శనివారం తెల్లవారుజామున నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారి వినోద్ కుమార్, ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి, పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 3,600 లీటర్ల నాటుసారా ఊట, బెల్లం ధ్వంసం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు.

రేపు దూపాడు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

కల్లూరు, ఫిబ్రవరి 24: కల్లూరు మండలంలోని దూపాడు సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మానానికి భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నట్లు హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ వి.విద్యాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా 500 కంటే ఎక్కువ ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సోమవారం కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్ సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి వర్చువల్ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం నుంచి ముఖ్య అతిథులు హాజరవుతారని ఎస్ఎస్ దూపాడు వేన్యూ సూపర్‌వైజర్ కేవై సంజన్న తెలిపారు.

కల్లూరు వైసీపీలో వర్గపోరు

» కార్పొరేటర్ల మధ్య కుమ్ములాట » 28వ వార్డు కార్పొరేటర్‌పై దాడి

కర్నూలు, ఫిబ్రవరి 24: కల్లూరు వైసీపీలో వర్గపోరు వెలుగు చూసింది. ఎమ్మెల్యే కాటసాని వర్గానికి చెందిన కార్పొరేటర్లు ఒకరినొకరు పరస్పరం దూషించుకున్నారు. శుక్రవారం లక్ష్మీపురంలో జరిగిన ఓ ఉత్సవానికి ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు నారాయణరెడ్డి, శ్వేతారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక భర్త శ్రీధర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్రీధర్ రెడ్డి వర్గానికి, నారాయణరెడ్డి వర్గానికి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే కాటసాని ఇరువురికి సర్దిచెప్పి పంపారు. అయితే శనివారం ఉదయం స్థానిక ఐటీసీ కూడలి సమీపంలోని రెహిమాన్‌పురం నివాసంలో ఉంటున్న 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి ఇంటికి కొంత మంది వ్యక్తులు వచ్చి దాడి చేసి చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. దాడి చేసిన వారిలో మున్సిపల్ వర్కర్లు చిరంజీవి, చిన్నబాబు, మల్లి, సురేష్‌లతోపాటు మరో 9 మంది ఉన్నట్లు నారాయణరెడ్డి గుర్తించారు. ఈ విషయం మరోసారి ఎమ్మెల్యే దాకా వెళ్లడంతో ఇరువర్గాలను పిలిపిపించినట్లు సమాచారం. అయితే ఇద్దరి మధ్య రాజీ కుదరకపోవడంతో నారాయణరెడ్డి వర్గం పోలీసులను ఆశ్రయించారు. శని వారం రాత్రి పొద్దుపోయే దాకా పోలీసులతో తమపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే.. రాత్రి కూడా మరోసారి చర్చలు జరిగి నట్లు ఆ చర్చలు కొలిక్కి వస్తా యని పోలీసులు కేసు నమోదు చేయడంలో తాత్సారం చేసినట్లు తెలిసింది.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నాయకులు కోరారు. శనివారం స్థానిక ఆర్ఐవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ జానకీరామ్‌కు ఏఐ ఎస్ఏ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్‌లు, ఫర్నీచర్ కల్పించాల న్నారు. విద్యార్థులు రవాణా శాఖ వల్ల ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం సమయానికి బస్సులు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. అదే విదంగా ప్రైవేటు, కార్పొరేట్ కొన్ని కళాశాలలో విద్యార్థులకు ఫీజుల పేరుతో హాల్‌టికెట్ల ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనీ, అలాంటి కళాశాలలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పెద్దయ్య, పవన్ ఉన్నారు

ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా

కర్నూలు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వకపోతే పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వంశీధర్ రెడ్డితోపాటు పలువురు ఆ పార్టీ నాయ కులు శనివారం టీడీపీ అధినేత చంద్రబాబుకు లేఖ రాశారు. మూడు సంవత్సరాలు ఇన్‌చార్జిగా పార్టీ ప్రతిష్ట కోసం ప్రభాకర్ పని చేశారని, టీడీపీలో సభ్యత్వం కూడా లేని బొగ్గుల దస్తగి రికి టికెట్ ఇవ్వడం ఎంత వరకు భావ్యమని పేర్కొన్నారు. టీడీపీ అధినేత పునరాలోచించి ప్రభాకర్‌కు టికెట్ ఇవ్వాలని కోరారు. తన భర్తకు టికెట్ ఇవ్వాలని ఆకెపోగు ప్రభాకర్ సతీమణి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చదువుల రామయ్య వర్ధంతి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 24: భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట యోధుడు చదువుల రామయ్య 32వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి అధ్యక్ష తన ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్‌లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ నగర కార్యదర్శి రామచంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల సెక్టోరల్ అధికారులతో సమావేశం

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 24: మున్సిపల్ కార్పొరేషన్ నూతన కౌన్సిల్ హాలులో ఆయన ఎన్నికల సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీసు అధికారులతో కర్నూలు నియోజకవర్గ ఎన్నికల అధికారి, కమిషనర్ భార్గవతేజ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా దుర్బలత్వాన్ని గుర్తించేందుకు ప్రొఫార్మా నిర్ణయించారని, అందులో నిర్దేశించిన మార్గదర్శక ప్రణాళిక ఆధారంగా సమస్యాత్మక అంశాలను, ఓటు హక్కు విని యోగంలో దుర్బలత్వాన్ని గుర్తించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ ఎమ్మార్వో మోహన్, నోడల్ పోలీసు అధికారి ఇంతియాజ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 24: ఈనెల 25 జరగనున్న గ్రూప్-2 సర్వీసెస్ స్క్రీనింగ్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇం టర్నెట్ సెంటర్లను మూసివేయాలని కార్మిక శాఖ ఉపకమి షనర్ కే.వెంకటే శ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ సెక్రటరీ విజయవాడ ఉత్తర్వుల మేరకు జిల్లా గ్రూప్-2 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్టు కో ఆర్డినే టర్ జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను యజమానులు మూ సి వేయాలన్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని ప్రాంతాలలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పథకాలు కొనసాగిస్తాం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24: రానున్న ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెడితే ప్రస్తుతం అమలవుతున్న పథకాలను కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులు, మధ్యతరగతి వారిపై అధిక భారాన్ని మోపిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ నెల 26న అనంతపురంలో జరిగే బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీ, పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పాల్గొని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తారని తెలిపారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెస్టింగ్‌పై శిక్షణ

ఆదోని టౌన్, ఫిబ్రవరి 24: స్థానిక ఏరియా ఆసుపత్రిలోని టీబీ యూనిట్ సెంటర్లో పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణను ఇచ్చినట్లు టీబీ యూనిట్ ఎంపీహెచ్ఎస్ బాబురాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన పరికరాల ద్వారా పరీక్షలను చేసే విధానం గురించి నిపుణులు వివరించారని పేర్కొన్నారు. పట్టణంలోని ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లలో శిక్షణ పూర్తి చేసిన ల్యాబ్ టెక్నీషియన్లు రోగులకు పరీక్షలను నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ సుబ్బమ్మ బాయి, వీరేష్ పాల్గొన్నారు.

వికలాంగుల డిమాండ్లను పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 24: వికలాంగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్న సుబ్బయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీతారామనగర్ కాలనీలోని వీహెచ్‌పీఎస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 కర్నూలులో జరిగే ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపకులు సభకు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ఈ సభకు వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అలాగే మార్చి 9న నిర్వహించే చలో అమరావతి సభకు తరలిరావాలని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు వైదుగప్ప, భీమేష్, తాయన్న, హనుమంతు, రవి, శారద, సరోజ, రామాంజనేయులు, రంగన్న పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 24: ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలు -103, 104, 84, 105, 106 సెంటర్లను ఎన్నికల బూత్ లెవెల్ అధికారులు మనోహర్‌రెడ్డి, కిష్టప్ప నాయక్ పరిశీలించారు. శనివారం ఆయా బూత్‌లను పరిశీలించి ఓటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తేవాలని సూచించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, శిల్పిభాస్కర్, కౌన్సిలర్ పూజా, పక్కీర్ప ఉన్నారు.

'బీవీని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలి'

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 24: ఎమ్మిగనూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రకటించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పార్లపల్లి మల్లికార్జున కోరారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రకటించకపోతే అన్ని గ్రామాల్లో టీడీపీ గ్రామ కమిటీలు, బూత్ ఇన్‌చార్జీలు, మండల కమిటీ సభ్యులు పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని పేర్కొన్నారు. అధికారం ఉన్నా..లేకున్నా బీవీ కుటుంబం నిత్యం ప్రజల్లో ఉంటూ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నారని కొనియాడారు. నాయకులు సోమేశ్వరరెడ్డి, డీలర్ ఈరన్న, కొటేకల్ ఖాజా, రంగన్న, దేవదాసు, హనుమంతు, వీరనాగప్ప, లోకారెడ్డి, రాఘవేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల : ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రకటించాలని మాజీ ఎంపీపీ హనుమంతు, మండల కన్వీనర్ నజీర్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు, బేతాళబడేసా, రామాంజినేయులు, గంజహళ్లి కృష్ణమనాయుడు, మిన్నల్ల, రమేష్ నాయుడు, రంగస్వామినాయుడు కోరారు. టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పాటు బీవీ నాయకత్వంలోనే టీడీపీ అభివృద్ధి కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్నామని తెలిపారు. శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2024 ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించారని, అందులో ఎమ్మిగనూరు నుంచి బీవీ జయనాగేశ్వరరెడ్డి పేరు లేదని అన్నారు. దీంతో తాము కొంత నిరుత్సాహపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో జాబితాలో కూడా టికెట్ కేటాయించక పోతే అప్పుడు ఆలోచించాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరించారు. మండల టీడీపీ నాయకులు, గ్రామకమిటీ సభ్యులు, బూత్‌కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : బీజేపీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఎస్ ఈరన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దనెలటూరు, చిన్ననెలటూరు, అల్వాల గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు కొణిగిరి నీలకంఠ సూచన మేరకు ప్రజా పోరు యాత్రను నిర్వహించారు. ఈరన్న మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ పథకాలకు తన పేర్లు పెట్టుకొని ప్రజలకు తానే అందిస్తున్నట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. దేశాభివృద్ధి ఒక్క నరేంద్రమోదీతోనే సాధ్యమని, మూడవ సారి కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రజాపోరు కన్వీనర్ నరసింహులు, నాయకులు మునిస్వామిగౌడు, మహేష్, రవికుమార్, వెంకటేష్, స్వామి, వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

28న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సమావేశాలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 24: ఈ నెల 28న కర్నూలు లోని మౌర్యఇన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీల అనుబంధ సంఘాల ఉమ్మడి సమీక్ష సమావేశాలను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌చైతన్య ఆధ్వర్యంలో సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. విశ్వరూప మహాసభలో ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఎలా వచ్చినా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశాలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. దివాకర్ చైతన్య, ఆదిత్య, రాహుల్, మధు, రాజు పాల్గొన్నారు.

గ్రూప్ పరీక్షలకు నేడు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 24: నేటి ఆదివారం గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆదోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ నుంచి ఉదయం 5 గంటలకే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డీపో మేనేజర్ మహమ్మద్ రఫీ తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి ఆదోని నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, పత్తికొండ, మంత్రాలయంకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. వివరాలకు 9959225797 నెంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

దైవ మార్గం వైపు నడవాలి

మద్దికెర, ఫిబ్రవరి 24: ప్రజలు తీరికలేని సమయాన్ని గడుపుతున్నారని, ప్రతి ఒక్కరూ దైవమార్గం వైపు నడవాలని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ దాత తలారి పరుశురాం, శకుంతలమ్మ దంపతులు, మాజీ జడ్పీటీసీ సభ్యులు రాజన్న యాదవ్ అన్నారు. శనివారం మద్దికెరలో లక్ష్మీనారాయణ స్వామి, మద్దమ్మ దేవాలయ స్థల పురాణానికి చెందిన 5వేల పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ రాజు యాదవ్, మండల తెలుగు యువత అధ్యక్ష ఉపాధ్యక్షులు మూలింటి రాఉ యాదవ్, ఎం. ఉదయ్ కుమార్ ఉన్నారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి : కేఈ

తుగ్గలి, ఫిబ్రవరి 24: రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలని పత్తికొండ టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కేఈ శ్యాంబాబు కోరారు. శనివారం కడమకుంట్లలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన సాగిస్తోందని, రామరాజ్యం కావాలంటే టీడీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ఘోరంగా విఫలమైందన్నారు. ఏ గ్రామంలో చూసినా సమస్యలు తాండవిస్తున్నాయని, కేవలం ఇసుక దందా, జూదాలపై మాత్రమే దృష్టి సారించి ప్రజా సమస్యలు గాలికి వదిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, మాజీ సర్పంచ్ పక్కీరప్ప, బొగ్గుల సుధాకర్, వెంకట్రాముడు, తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, తులసినాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కడమకుంట్లలో సమస్యలు తెలుసుకుంటున్న కేఈ శ్యాంబాబు

చర్చిలో కేఈ ప్రార్థనలు

ఆలూరు : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ సీఎం కావాలని కోరుతూ ఆలూరు పట్టణంలోని హోరేబు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తనకు పత్తికొండ అసెంబ్లీ స్థానానికి అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు చిన్నబాబు, సురేంద్ర, రఘు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు

వెల్దుర్తి/పత్తికొండ టౌన్/తుగ్గలి : తెలుగుదేశం పార్టీ పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఈ శ్యాంబాబును పార్టీ అధిష్ఠానం ప్రకటించడం పట్ల పత్తికొండ, వెల్దుర్తి, మద్దికెర టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. వెల్దుర్తి మండల కార్యాలయం ఎదుట బాణ సంచా కాల్చి స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సీనియర్ నాయకులు బొమ్మన శివశంకర్‌రెడ్డి, చిన్నగోపాల్‌గౌడ్, రాఘవేంద్రగౌడ్, కిరణ్, రాంబాబు పాల్గొన్నారు. పత్తికొండలో నాలుగు స్తంభాల కూడలి వద్ద టీడీపీ శ్రేణులు బాణాసంచా పేలుస్తూ సంబరాలు



కేఈ శ్యాంబాబుకు మిఠాయిలు తినిపిస్తున్న తుగ్గలి నాయకులు

చేసుకున్నారు. మండల కన్వీనర్ సుధాకర్, ఎస్సీ, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు సోమ్లా నాయక్, వెంకటపతి, బీటీ గోవిందు, శ్రీనివాసులు గౌడు, ప్రకాష్ పాల్గొన్నారు. తుగ్గలి టీడీపీ నాయకులు మనోహర్‌చౌదరి, మాజీ సర్పంచ్ చక్రాల విరేష్, డీలర్ సుంకన్న కేఈ శ్యాంబాబుకు శాలువ కప్పి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

పెత్తందారులకు సింహ స్వప్నం చదువుల రామయ్య

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 24: కర్నూలు జిల్లాలో కరువుగట్టిన భూస్వామ్య పెత్తందారుల పాలిట సింహ స్వప్నం చదువుల రామయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో చదువుల రామయ్య 33వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా సీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఆనాడు చదువుల రామయ్య గ్రామ గ్రామన పర్యటించి పెత్తందారుల దౌర్జన్యాలను, దోపిడీ విధానాలను ఎదురించి ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. పత్తికొండ ప్రాంతంలో నిరంతర పోరాటాలు జరిపి ఎన్నో విజయాలు సాధించడమే కాక ఈ ప్రాంతానికి హంద్రీనీవా జలాలు వచ్చాయంటే రామయ్య చలవేనని స్పష్టం చేశారు. కష్టజీవుల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన ఆయన ఆశయ సాధనకై కార్యకర్తలు పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహేబ్, ప్రజా సంఘాల నాయకులు నబీరసూల్, మద్దిలేటి శెట్టి, కారన్న, వీరన్న, రామాంజనేయులు, సుంకయ్య పాల్గొన్నారు.



భక్తుల మధ్య ఊరేగుతున్న సద్గురు సిద్ధారుడ మహాస్వామి

వైభవంగా సిద్ధారుడ మహాస్వామి రథోత్సవం

కోసిగి, ఫిబ్రవరి 24: కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో మూడు రోజులుగా అరుదాజ్యోతి శాంతాశ్రమంలో సద్గురు సిద్ధారుడ అష్టమ వార్షికోత్సవ జాతర, జ్ఞాన దాసోహ కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. హుబ్లి పీఠాధిపతి పరమపూజ్య అభినవ సిద్ధారుడ మహాస్వాములు భక్తులకు ప్రవచనాలను వివరించారు. అనంతరం మేళతాళాల మధ్య కలశాలతో రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు, యువకులు, కోలాటాల ప్రదర్శనలతో అలరించారు. కమిటీ సభ్యుల భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మైనార్టీ విద్యార్థులపై చిత్తశుద్ధి ఇదేనా ?

ఆదోని, ఫిబ్రవరి 24: మైనార్టీ విద్యార్థులపై వైసీపీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా..? అని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు అన్నారు. శనివారం ఆదోని నియోజకవర్గ మండల పరిధిలో ఆరేకల్లు గ్రామ సమీపాన ఉన్న మైనార్టీ ఐటీఐ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో 45శాతం ఉన్న మైనార్టీలను దృష్టిలో ఉంచుకొని నాడు రూ.3.91 కోట్లతో ఐటీఐ కళాశాల నిర్మాణం చేపట్టిందని గుర్తుచేశారు. ఐటీఐ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు కావస్తున్నా సీఎం జగన్ రెడ్డి సౌకర్యాలు కల్పించి సిబ్బందిని నియమించలేదని విర్శించారు. నాలుగేళ్లుగా భవనానికి తాళాలు వేసి పాడుపడ్డ భవనంలా మార్చారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి మైనారిటీ ఐటీఐ కళాశాల సమస్యలు పరిష్కరించి అందుబాటులో తేవాలని కోరారు. లేని పక్షంలో మంత్రుల, ఎమ్మెల్యేల, సంబంధిత అధికారుల కార్యాలయాలు



మైనార్టీ ఐటీఐ కళాశాలను చూపుతున్న నాయకులు

ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు బిల్లేకల్లు సూర్య, రమేష్, గణేష్, సాయి, నూర్, మెహబూబ్, కిషోర్, సాయి, తాహేర్, ఇర్ఫాన్, అర్మాన్, సోహైల్ పాల్గొన్నారు.

కందనాతి గ్రామంలో పోలీసు పికెటింగ్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 24: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కందనాతి గ్రామంలో రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ నెల 21వ తేదీన గ్రామానికి చెందిన బోయ శివశంకర్, బోయ మారెన్నల కుటుంబికులు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇరువురికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోయ రవి మృతి చెందగ, నరసింహులు పరిస్థితి విషమంగా ఉంది. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు గ్రామంలో పోలీస్ పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన 11 కుటుంబాలు తమ ఇళ్లకు తాళాలు వేసి గ్రామం వదిలి వెళ్లినట్లు గ్రామస్థులు, పోలీసులు తెపారు.

నవరత్నాల రథోత్సవం

మంత్రాలయం, ఫిబ్రవరి 24: రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై రమణీయంగా ఊరేగారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు హస్తోదకం చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛర ణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను శ్రీమఠం ప్రాంగణం చుట్టూ రమణీయంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో ఉత్సవ మూర్తిని అధిష్ఠించి ఊయలలో ఊగించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

భక్తుల కోలాహలం

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. శనివారం దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు మఠం అతిథి గృహలు, ప్రైవేట్ లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ముందే భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీతోనే బడుగుల అభివృద్ధి: బీవీ

నందవరం, ఫిబ్రవరి 24: టీడీపీతోనే బీసీ, ఎస్టీ, ఎస్సీ అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం నందవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో భాగంగా బీవీ ఇంటింటా పర్యటించారు. ప్రజా సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాకా నవరత్నాల పేరుతో ప్రజలను పూర్తిగా నాశనం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చేస్తానని లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు విద్యుత్ మోటర్లు బిగించి వారి దగ్గర నుంచి వసూళ్లు చేస్తున్నారన్నారు. వర్షాలు లేక పంట దిగుబడులు లేక వేసిన పంటలకు కనీసం పెట్టుబడి రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ డివి రాముడు, గురురాజారావు, నాగరాజుగౌడు ధర్మాపురం గోపాల్, మస్తాన్, రహిమాన్, మాచాపురం వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

బీవీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిక

నందవరంలో పెద్దకొత్తిలి గ్రామాని చెందిన వైపీపీ నాయకుడు చెన్నారెడ్డితో పాటు మరో 50 మంది మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీలో కార్యకర్తలకు ప్రభుత్వం చేసిందేమి లేదని టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజలు ఆకర్షితులమయ్యామని పేర్కొన్నారు. టీడీపీ చేసిన అభివృద్ధి పనులు, బీవీ జయ నాగేశ్వరరెడ్డి చేసిన పనులు ఎమ్మిగనూరులో చిరస్థాయిగా నిలిచాయన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యేగా బీవీ జయనాగేశ్వరరెడ్డిని గెలిపించుకుంటామని అన్నారు.

కార్యకర్తలు టీడీపీ పునాదులు: బీవీ

కార్యకర్తలే టీడీపీ పునాదులని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం కార్యకర్తలతో సమావేశం జరిగింది. ప్రతి కార్యకర్త టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

వైసీపీకి గుమ్మనూరు నారాయణ రాజీనామా

● ఇన్‌చార్జి విరుపాక్షి తీరు వల్లే పార్టీని వీడుతున్న ప్రకటన

ఆలూరు, ఫిబ్రవరి 24: వైసీపీ పార్టీకి ఆలూరు మార్కెట్ యార్డు చైర్మెన్ గుమ్మనూరు నారాయణ, ఆయన అనుచర వర్గం గుడ్‌బై చెప్పారు. శనివారం ఆలూరు అర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి మంత్రి గుమ్మనూరు జయరాం ఎంతగానో కృషి చేశారన్నారు. అలాంటి వ్యక్తిని కాదని, రాజకీయ అవగాహన లేని విరుపాక్షిని ఆలూరు సమన్వయ కర్తగా నియమించడం సరైన నిర్ణయం కాదన్నారు. మంత్రి అనుచరులను పక్కన పెట్టిన విరుపాక్షి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై రీజినల్ కో ఆర్డినేటర్ రామ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యకు ఎన్నిసార్లు ఫోన్లు చేసిన స్పందించలేదన్నారు. జయరాంకు ప్రాధాన్యత ఇవ్వలేని పార్టీలో తాను ఉండలేనని స్పష్టం చేశారు. ఉరవకొండ నుంచి మంత్రాలయం వరకు రెడ్డి సామాజిక వర్గం, కుటుంబం రాజ్యమేలుతోందని, బీసీ వర్గానికి చెందిన జయరాంపై కుట్రలు పన్ని విరుపాక్షికి టిక్కెట్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఓడిపోతే వారు సామాజిక ఇన్‌చార్జి తప్పించి ఆలూరును కూడా వారు స్వాధీనంలో ఉంచుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రత్యామ్నాయంగా తాను ఏ పార్టీలో కొనసాగాలనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తానని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 24: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎమ్మిగనూరుకు చెందిన ఎస్టీయూ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఎస్టీయూ మండల అధ్యక్షుడిగాను, ప్రధాన కార్యదర్శిగాను, జిల్లా ఉపాధ్యక్షులుగాను, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుర్తించిందని పేర్కొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

● ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదోని, ఫిబ్రవరి 24: ఎన్నికల విధి నిర్వాహణలో ప్రతి అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. శనివారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ, వీవీటీ, వీఎస్‌టీ టీములతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను సుజావుగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించామన్నారు. ఎన్నికల విధులు నాణ్యతతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎలక్షన్ విధులలో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, డీఎల్‌పీవో కార్యాలయపు పరిపాలనా అధికారి వీరభద్రప్ప, ఎంపీడీవో (ఇన్‌చార్జి) విజయశేఖర్, మునిసిపల్ అధికారులు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

పత్తిపాడు టీడీపీ అభ్యర్థిగా రామాంజనేయులు

ఆలూరు, ఫిబ్రవరి 24: గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఆలూరుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూర్ల రామాంజనేయులును శనివారం నియమించారు. ఆలూరులో స్థానిక అంబేద్కర్ కూడలిలో ఆయన ఇంటి ముందు బంధువులు, మిత్రులు బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

జయహో బీసీ మహాసభకు తరలి రండి

ఆలూరు, ఫిబ్రవరి 24: కర్నూలు ఎంఆర్‌సీ ఫంక్షన్ హాలులో ఈనెల 25న తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు ఆధ్వర్యంలో జయహో బీసీ మహాసభను నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సాధికారత జిల్లా సమితి అధ్యక్షులు భాస్కర్ నాయుడు శనివారం తెలిపారు. ఈ మహాసభకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెం నాయుడు, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లి రవీంద్ర హాజరవుతారన్నారు. ప్రతి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్



దగ్ధమవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కోసిగి, ఫిబ్రవరి 24: మండల కేంద్రం ఆదోనికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన శ్రీరామ దేవాలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఒక్కసారిగా మంటల దాటికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. చాలా సమయం తర్వాత విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో కోసిగి గ్రామం మొత్తం చీకటిమయమైంది. కరెంటు పోవడంతో ఉక్కపోతతో కోసిగి ప్రజలు అల్లాడిపోయారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని హెచ్ మురవణి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శనివారం సచివాలయం ఎదుట సర్పంచు జానికమ్మ తండ్రి వైసీపీ నాయకుడు దేవదానంను బీసీ కాలనీ మహిళలు నిలదీశారు. తమ కాలనీకి వచ్చే తాగునీరుని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి తాగునీటి సరఫరాను బంద్ చేశారు. అలా ఎలా బంద్ చేస్తారు అని నిలదీశారు. తమ కాలనీకి వచ్చే తాగునీటిని వెంటనే పునరుద్దరించాలని తెలిపారు.

నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే విఫలం

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 24: సీఎం జగన్ ఆదోని నియోజకవర్గం అభివృద్ధికి ఇచ్చిన హామీని, నిధులను రాబట్టుకోవడంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి విఫలమయ్యారని టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో సీఎం జగన్, స్థానిక ఎమ్మెల్యే సాయి చిత్రపటాలను పట్టుకొని మాట్లాడారు. 2022 జూలైలో విద్యాకానుక పంపిణీ కోసం ఆదోనిలో సీఎం జగన్ పర్యటించి ప్రజల సాక్షిగా పట్టణాభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకోవడం చేతకాక, తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే అప్పు రూపంలో రూ.20 లక్షలు ఇచ్చానని చెప్పడం సమంజసం కాదని పేర్కొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి రథోత్సవం

దేవనకొండ, ఫిబ్రవరి 24 : మాఘ పౌర్ణమి సందర్భంగా కౌలుట్ల చెన్నకేశవస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. కప్పట్రాళ్ల రిజర్వు పరిధిలో వెలసిన కౌలుట్ల చెన్నకేశవస్వామి వార్షిక బ్రహోత్సవాలలో భాగంగా శనివారం స్వామి, భూదేవి, శ్రీదేవి రథోత్సవం భక్తుల గోవింద నామ స్మరణతో ముందుకు సాగింది. వేలాది భక్తాదుల స్వామి వారి సన్నిధికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విరుపాక్షి, పాలకుర్తి హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : ఎస్టీయూ

ఆలూరు, ఫిబ్రవరి 24: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి బంటనహల్ నాగరాజు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పై రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 27న ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో ముందస్తుగా పోలీసులు నాగరాజుకు శనివారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చి ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు తక్షణమే ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఉద్యోగులకు అమలు చేసి ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.